వ్యాస కౌముది



# నాచనసోమనాథుడు – 4

– బాలాంత్రపు వేంకటరమణ

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

రాజసూయం చేసేవాడు బ్రహ్మదత్తుడా! రభసము ఎగసన్ అంటే అర్భాటంగా చేయించేవారు హంసడిభకులా! చెల్లబో అంటే భళా! ఇంక ఈ కృష్ణుడు ఉప్పుమోసేవాడే కాక తప్పదు మరి !

ఉప్పు కప్పంగా చెల్లించాలి అనేదాన్ని తాను ఉప్పు మొయ్యడంగా చిత్రించాడు. ఇలా తనమీదకి సవాలుగా తీసుకోవడంవల్ల అనుచరులైన యాదవ మహావీరుల్లో రోషమూ, హంసడిభకులపట్ల ఆగ్రహమూ ప్రజ్వరిల్లుతాయి. తనకు తాను మురవిరోధి అని చెప్పుకోడంలో "మురాసురిడిలాంటి వాణ్ణే అనాయాసంగా సంహరించిన వాడిని – నాకు ఈ హంస డిభకులు ఒక లెక్కా! అనే ధ్వని. ఇది తన గొప్ప తాను చెప్పుకోడం కాదు. దీన్ని అర్థాంతర సంక్రమిత వాచ్య ధ్వని – అంటారు. రామాయణం లో కూడా ఒక చోట నిరహంకారి, వినయశీలి అయిన శ్రీ రామచంద్రుడు కూడా "రామో అస్మి సర్వం సహ – నేను రాముణ్ణి – కనుక భరిస్తాను" అన్నాడు. అక్కడా ఇదే ధ్వని.

ఇంక హాస్యపు ధోరణి కట్టిపెట్టి గంభీరంగా రోషావిష్కరణం చేస్తున్నాడు. కావ్యం చదివేటప్పుడు పాత్రల మొహంలోనూ, కంఠంలోనూ వచ్చే మార్పుల్ని ఊహించుకుంటూ చదివితే ఆ రసం బోధపడుతుంది.

**అప్పన మెంతగావలె నహంకరణంబు దొఱంగి యిచ్చినన్**
**గప్పముపేర, నేడు నొడికారితనంబున మోసపుచ్చగా**
**నుప్పులుదెత్తురే ! సమరయోగ్య తలంబున వైరికోటితో**
**నుప్పన బట్టె లాడునెడ నుప్పులు దెత్తురు గాక యాదవుల్!**

వ్యక్తిత్వాన్ని చంపుకుని (అహంకరణంబు దొఱంగి) కప్పం అని చెల్లించినట్టయితే ఆ కానుక (అప్పనము) ఎంతటిది కావాలేమిటి? ఉప్పురాయి ఇచ్చినా మేరు పర్వతం ఇచ్చినా ఒక్కటే. కప్పం కప్పమే. అవతలవారి సార్వభౌమత్వాన్ని అంగీకరించినట్టే, వ్యక్తిత్వాన్ని చంపుకున్నట్టే .

"శౌరిని ఇయ్యాగమునకు వేగరమ్మనుము, యాదవులచేత లవణమెంతేని నడుగుము " అని పదాలు జాగ్రత్తగా పేర్చుకుని కప్పం అనే మాట రాకుండా, ఇంత అని చెప్పకుండా, శత్రుత్వం స్ఫురించకుండా – మాట నేర్పరితనంతో (నుడి–నొడి కారితనంబునన్)

మాయచేస్తే (మోసపుచ్చగాన్) ఉప్పు తీసుకువస్తారా మా యాదవులు? తీసుకురారు! సమయానికి యోగ్యమైన ప్రదేశంలో శత్రుసమూహంతో ఉప్పనబట్టెలాడేటప్పుడు తప్పకుండా ఉప్పును తీసుకువస్తారు .

ఉప్పన బట్టెలాట అనేది తెలుగువారి గ్రామీణ క్రీడ .ప్రతిపక్షంవారిని తప్పించుకుంటూ వారికి పట్టుబడకుండా అవతలి గడిలోంచి గుప్పెడు ఇసుక తెచ్చి తమ గడిలో కలుపుకుంటే గెలిచినట్టు. ఇసుక తీసుకు రావడాన్నే ఉప్పుతీసుకురావడం అంటారు . ఇది జయానికి సంకేతం.

హంసడిభకులతో యుద్ధమంటే మాకు ఉప్పనబట్టెలాట లాంటిది. ఉత్సాహం ఉరకలు వేస్తుంది. వాళ్ళ బలాలూ, వాళ్ళ వరాలూ మాకు లెక్క లేదు. మమ్మల్ని భయపెట్టవు. ఆ ఉప్పన బట్టెలాటలో మేం తప్పకుండా ఉప్పు తీసుకువస్తాం – అంటే గెలిచి తీరుతాం !

"ఉప్పన బట్టెలాటని" ప్రస్థావించడంవల్ల యాదవువీరుల్లో ఉత్సాహం ఉరకలు వేస్తుంది. వీర రస స్థాయి కుదురుకుంటుంది. ఇప్పుడు శ్రీకృష్ణుడు వారితో ఇలా అంటున్నాడు.

అనిపలికి యాదవలోకంబు నాలోకించి –

**కలరా ఇంతకు మున్ను యాదవులచే గప్పంబు దెప్పింపగా**
**గల రారాజులు మున్న, గాజులుం దొడవుగా గల్పించిరా, కాకులం**
**కలకంఠంబుల జేసెనా కటకటా గౌరీశ్వరుం, డేమి కా**
**గలవారో యిటమీద హంసడిభకుల్ గర్వాంధకారంబునన్**

యాదవవీరులారా! చరిత్రలో ఎప్పుడయినా యాదవులతో కప్పం కట్టించుకున్న రారాజులు – చక్రవర్తులు – ఉన్నారా? లేరు. అంటే వారంతా గాజులు తొడుక్కున్నవారేనా! తొడవులు అంటే భూషణాలు. ఇంతకాలానికి ఈ హంసడిభకులు బయలుదేరారు – మగవాళ్ళు – మనతో కప్పం కట్టించుకోడానికి!

గౌరీశ్వరుడు వరాలిచ్చి కాకుల్ని కోయిలలు చేసాడా! కటకటా, అయ్యయ్యో! వరాలవల్ల కలిగిన గర్వాంధకారంతో పెట్రేగిపోతున్నారు. పాపం హంసడిభకులు ఏమయిపోతారో! సర్వనాశనం అవుతారని తాత్పర్యం.

హాస్యవీరాల సాహిత్య రసపోషణ ఇది.

హంసడిభకులకి నోటిచొరవ ఎక్కువ. అ చొరవతోనే శివుణ్ణి వరాలడిగారు. ఆ చొరవతోనే మునిల్నీ, అందునా దూర్వాసుణ్ణి అవమానించారు. ఆ చొరవతోనే మనల్ని కప్పం కూడా అడిగారు. ఆ చొరవకారణంగానే అంతం కాబోతున్నారు. అంటున్నాడు శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణుడలా అనగానే, యాదవవీరులు పరస్పరం చేతులు చరచుకుంటూ ఇలా ఆట పట్టిస్తున్నారు.

**యాదవులుప్పు మోవక మురారికి సోలలు మోవ కింక బో**
**రాదు, హలాయుధుం గొలువ రమ్మనరై రటుగాని యాగముం**
**గాదట చేయ హంసడిభక క్షితిపాల కుమారులంచు, నా**
**బీదలకేల పోగుబడి బెద్దఱికంబును బెట్ట బీరమున్**

అవునండీ! యాదవులకు ఉప్పు మొయ్యకా తప్పదు, శ్రీకృష్ణుడికి సోలలు మొయ్యకా తప్పదు. ఈ కాలం వారికి తెలియదు కానీ, మా చిన్నతనంవరకూ కొలమానాలు సోలలు, వీసెలూ, కుంచాలు వగైరా ఉండేవి. అందుకే అంటున్నారు. మనకి ఉప్పు బస్తాలు మోయకా తప్పదు, శ్రీకృష్ణుడికి సొలలతో ఆ ఉప్పుని కొలుస్తూ అక్కడ పొయ్యకా తప్పదు. తప్పించుకోలేంరా బాబూ – అని అర్థం.

ఇంకా నయం – బలరాముణ్ణి కూడా సేవకు రమ్మన్నారు కాదు.

అలా అయితేగానీ హంసడిభకులు యాగం చెయ్యడం పూర్తికాదుట పాపం! అంటూ యాదవ వీరులు అపహసిస్తున్నారు. మరికొందరైతే "ఆ అల్పులకి ఎందుకయ్యా పోగుబడి పెద్దటికము, అంటే తెచ్చిపెట్టుకున్న పెద్దరికమూ, బెట్టబీరమున్, అంటే మహా పరాక్రమమూనూ.

ఇలా యాదువవీరులందరూ చేతులూ, జబ్బలూ చరుచుకుంటూ హంసడిభకుల్ని అపహాస్యం చేశారు.

శ్రీకృష్ణుడు కూడా వారితో వంతకలిపి గలగలా నవ్వి, దూతగా వచ్చిన జనార్దనుడు వినేలా గంభీరంగా ఇలా పలికాడు.

**అరి గరమున నే దాల్చిన**

**నరి గరము నగేంద్రధీరు డయినం జెడడే**

**యరి దిరమై నన్నడుగుట**

**యరిది రమైకాభిలాషులగు నృపతులకున్**

అరి అంటే చక్రము, శత్రువు, కప్పము అని అర్థాలు. కరము అంటే చేయి, మిక్కిలి; తిరము అంటే స్థిరము. అరిది అంటే అరుదైన.

సుదర్శన చక్రాన్ని చేతిలో నేను ధరిస్తే శత్రువు మిక్కిలి ధీరుడైనా – మహా పర్వతంలాంటి ధీరుడైనా సరే నాశనమైపోడా!

కప్పం చెల్లించమని ధీమాగా – తిరమై – నన్నడగడం, తమ సంపద నిలుపుకోవాలనుకునే రాజులకి చాలా అరుదైన విషయం సుమా.

రమా+ఏకలాభిలాషులగు నృపతులు – తమ రాజ్యాన్నీ, తమ సంపదనీ నిలుపుకోవాలనుకునే రాజులు ఎవరూ నన్ను కప్పం అడగరు. అడిగి, బ్రతికి బట్టకట్టారు. హంసడిభకులు ఆడిగారు అంటే నాశనం కోరుకుంటున్నారు.

శ్రీకృష్ణుడు కొనసాగిస్తున్నాడు.

**వెదకంబోయిన తీవ కాల దవిలెన్, వేయేల దుర్వాసుచే**

**మొదటన్ సంచకరంబు హంసడిభకోన్మూల క్రియాకేళికిం**

**గుదురైయున్నది, సాటిగాక యిట మత్కోదండ కాండోదర**

**ప్రదర ప్రావరణాంబుద ప్రకట శంపాకంప శాత్కారముల్**

శ్రీకృష్ణుడు ఇంకా ఇలా అంటున్నాడు. వెదకబోయిన తీగ కాలికి తగిలింది. వెయ్యేల! హంసడిభకుల ఉన్మూలనక్రియ – పెకిలించి వెయ్యడం అనే కేళికి దూర్వాసుడు ముందే బయానా (సంచకరంబు – అంటే బయానా; వస్తువుల బేరసారాల్లో ముందుగా ఇచ్చే రొక్కం). అంతకు పూర్వం హంసడిభకులు ఒకసారి వేటకి వెళ్ళినప్పుడు అక్కడ కొందరు మునులను అవమాన పరిచారు కదా. వారిలో దూర్వాసమహర్షి కూడా ఉన్నాడు. ఆయన తన తపోశక్తితో వారిని భస్మీపటలం చేయకుండా వెళ్ళి శ్రీకృష్ణుడితో చెప్పాడు. శ్రీకృష్ణుడు హంసడిభకులని శిక్షిస్తానని దూర్వాసమహర్షికి అప్పుడే వాగ్దానం చేశాడు.

అందుకే ఇప్పుడు శ్రీకృష్ణుడు జనార్దనుడితో అంటున్నాడు. సంధించిన బాణంతో నా ధనుస్సు ఒక మేఘం. దానినుంచి ఉరుముల్లా ధ్వనిచేస్తూ (శాత్కారము) మెరుపుల్లా (శంపా) బాణాలు వెలువడటమొక్కటే తరువాయి.

ఉప్పు కప్పంగా అడిగి మమ్మల్ని అవమానించినందుకు కాదు. దూర్వాసాది మునిపుంగవుల్ని అవమానించినందుకు ఈ శిక్ష – అని.

"మత్తోద్దండ కాండోదర ప్రదర ప్రావరణాంబుద ప్రకట శంపాకంప శాత్కారముల్" అంటున్న శ్రీకృష్ణునిలో రౌద్రం స్ఫురిస్తోంది.

జనార్దనుడు వెళ్ళి హంసడిభకులకు ఏమి చెప్పాలో, ప్రతిసందేశం వివరిస్తున్నాడు.

వారలతో నిట్లనుము.

**ఈశు వరముచేత నెవ్వడే నిప్పాట**

**శూరుడైన – దువ్వుజూచి నక్క**

**యొడలు గాల్చికొన్న వడువున మీరింత**

**లావు మాటలాడ లజ్జగాదె!**

జనార్దనా! వాళ్ళతో ఇలా చెప్పు. శివుడిచ్చిన వరంతో ఎవడైనా ఇలా మహావీరుడే కావచ్చు. కానీ అలాంటివాణ్ణి చూసి మీరిలా లావుమాటలు అంటే పెద్ద పెద్ద మాటలు, వీరాలాపాలు – పలకడం సిగ్గు సిగ్గు. పులిని చూసి నక్క తన ఒళ్ళంటా వాతలు పెట్టుకున్నట్టుగా ఉంది మీ వ్యవహారం.

**హరి గదావిహార మల్లంత దోచిన**

**వరము మిమ్ము గాన వలతి యగునె!**

**వెఱ్ఱివార! పిడుగు వ్రేసిన దలటొప్పి**

**యాగునే! వివేకమైన వలదె !**

ఈ శ్రీకృష్ణుడి గదావిహారం అల్లంత దూరంలో కనిపించిందంటే చాలు, వరం గిరం పారిపోవలసిందే. అది మిమ్మల్ని కాపాడగలుగుతుందా! వలతి అంటే సమర్థము.

వెర్రిమొహల్లారా. పిడుగు పడితే తలటోపీ ఆగుతుందా. ఆ మాత్రం వివేకమయినా ఉండవద్దా మీకు! బలపరాక్రమాలు లేకపోతే లేకపోయాయి, కనీసం వివేకమయినా ఉండవద్దా! అని ఎగతాళి.

**అగునో కావో వరములు**

**డిగ విడువగ రాదు హంసడిభకుల, నన్నున్**

**మొగరించిన హరునైనను**

**జగమెఱుగగ దోలి తమ్ము జంపెద ననుమీ!**

వరాలు ఉన్నయో, లెవో – అవి కాపాడతాయో కాపాడవో అది వేరే సంగతి. హంసడిభకుల్ని మాత్రం వదలను. వదలరాదు. సాక్షాత్తూ ఆ శివుడే వచ్చి నాతో తలపడితే – మొగరించినన్ – లోకమంతటికీ తెలిసేలాగా పారద్రోలి హంసడిభకుల్ని వధిస్తానని చెప్పు.

యుద్ధం ఎక్కడ కావాలి? మధురా పట్టణమో, ప్రయాగయో, పుష్కరస్థలమో – ఎక్కడంటే అక్కడ, ద్వంద యుద్ధమా? ఏ అయుధాలయినా సరే! వారు కోరుకున్న ఆయుధాలతో – ఆ ఎంపిక కూడా వారిదే – అని శ్రీకృష్ణుడు హంసడిభకులకు ప్రతి సందేశం పంపించాడు.

శ్రీకృష్ణుని ప్రతిసందేశాన్ని తీసుకుని జనార్ధనుడు తిరిగి వెళ్ళి హంస డిభకులకు అంతా చెప్పాడు. అంతేకాదు జనార్దనుడు శ్రీ కృష్ణుని గూర్చి, అతని వైభవం గురించి, అతని సభని గురించి, అతని భక్తులగురించి ఉపన్యసించగా, హంసుడు కోపించి అతనితో ఇలా అంటున్నాడు. ఇది నాచన సోమనాథుని గారి మరొక రసవత్తరమైన పద్యం

నిను రప్పింపకమున్న వేడ్కపడి పూనెన్ శార్ ఙ్గ కౌమోదకీ
వనమాలాంబుజ జక్ర భూమికలుఁ గైవారంబు జేయించె నే
లిన నాగారులచేత యాదవుల నోలిం గొల్చి కూర్చుండఁగాఁ
బనిచెన్ గేశవుఁడైంద్రజాలికు గతిం బ్రాతయ్యె నీకంతటన్

ఓరి పిచ్చివాడా ! కృష్ణుడు భగవంతుడు కాడు గిగవంతుడు కాడు . చెప్తాను విను . ఆ విల్లు (శార్ఙ్గ) , గద (కౌమోదకి), – మెడలోవేసుకున్న వైజయంతీమాల (వనమాలా), చేత్తొ పట్టుకున్న కలువపువ్వు (అంబుజం), సుదర్శనచక్రం – అవన్నీ అతనికి సహజమైనవి కావు . ఆ ఆయుధాలూ అవీ సభలో కూర్చున్నప్పుడు ఊరికే అలంకారప్రాయంగా ధరిస్తాడు . దర్శనానికి వచ్చిన వారు చూసి హడిలిపోడానికి .ఉత్త హంగు, ఆర్భాటం, అంతే .

నువ్వు రావచ్చు అని కబురు పంపే ముందు అతడు సభ తీర్చి, అందరినీ కూర్చోబెట్టి అలంకారాలు చేసుకొని, వంధి మాగధులని నిలబెట్టి పెద్ద పటాటోపం చేశాడు .అదంతా చూసి నువ్వు పరమేశ్వర లక్షణ మనుకొన్నావు .

నిను రప్పింపకముందు అనడంలో వేషం పూర్తికాక ముందే వాడిని రానీకండి అని పడే తొందఅ వ్యంగ్యమౌతోంది .వేగ పడి అనడంలో, తొందఅ తొందఅగా వేషం వేసుకుని .

వేడ్కపడి – అతని కది ఒక వేడుక .అది సామర్థ్యము కాదు, శక్తీ కాదు .

సార్జ్గ–కౌమొదకీ...అనే సమాసం అంతా వ్యంగ్య సూచకమే .

ఏలిన నాగారుల చేత – తన పాలనలోని గరుత్మంతుడు) నాగ + అరి – పాములకు శత్రువు. నాగారి కి బహువచనము నాగారులు . ఇది ఆక్షేపణ కోసం . ఎందుకూ పనికి రాని వాడిని" అబ్బ ! వచ్చారండీ దొరగారు "అన్నట్టు . దీనిలో ద్వేషము వ్యంగము, నిరాదరణ వ్యంగము .

ఓలిం బిల్చి – వరుసగా పిలిచి యాదువలని పేరు పేరునా పిలిచి కూర్చోపెట్టాడట .

ఇదంతా హంసుడు ఊహించిన వ్యవహారం .సర్వం కృష్ణుని యందు తిరస్కార భావం చూపిస్తుంది .

ఇదంతా ఆ కృష్ణుడు ఇంద్రజాలికుడిలా చేశాడు . ఇంద్రజాలికుడు లేనిచోట ఉన్నట్టు కనిపించేలాగ చేస్తాడు .

ప్రాతయ్యె నీకంతటన్ . ప్రాతి అంటే ఆధిక్యము – గొప్ప . అది నీకు గొప్పగా కనిపించింది . అతని మాయలో పడిపోయి నువ్వు ఆ కిటుకుని గ్రహించలేకపోయావు. అన్నాడు హంసుడు.

ఆ తరవాత పుష్కర క్షేత్రంలో శ్రీకృష్ణుడికీ హంస డిభకులకీ మధ్య ఘోర సంగ్రామం జరిగింది. శ్రీ కృష్ణుడు హంసుడిని ఒక పెద్ద మడుగులో తొక్కి చంపేశాడు . అప్పుడు తమ్ముడు డిభకుడు ఇలా విలపిస్తున్నాడు.

నా యెల్లినీడలోన నరలోకమేలుదు నను
    లావు వఱితి పాలయ్యెనన్న
దేవేంద్రునకునైనఁ దేఱి చూడఁగ రాని
    గర్వోన్నతి నీటఁ గలసెనన్న
పార్వతీ పతి చేతఁ బడసిన దివ్యాస్త్ర

భూరి సంపద వెల్లిబోయెనన్న
వలరాజునకునైన వర్ణింపగాఁ దగు తనూ
విలాసం బేఱు గొనియెనన్న
యన్న నీ యట్టి యన్న నన్నుదినంబుఁ
గారవింపఁగ నుండ నే కరదు నింక
నింక జాల నెవ్వ గలచే నిచట నిలువ
నాకు నేల – నీ తోడిదే లోకమన్న

అన్నగారి చావుకు తమ్ముడు ఏడ్చిన ఏడుపిది.

ఎల్లి అంటే రేపు, గొడుగు అని అర్థాలు. నా గొడుగు నీడలో ఈ లోకమంతా ఏలుతానన్నఓ అన్నా, నీ లావు, బలం కాస్తా నరదపాలయింది కదా.

దేవేంద్రుడైనా తేరిపార చూడలేని నీ గర్వోన్నతి నీటిలో కలిసిపోయింది కదా అన్నా.

పరమశివుడి చేత పొందిన గొప్ప దివ్యాస్త్ర సంపద అంతా ప్రవాహంలో కొట్టుకుపోయింది కదా ఓ అన్నా. వెల్లి అంటే ప్రవాహం. వెల్లి వచ్చింది, వెల్లువొచ్చింది అంటాం కదా.

మన్మధుడితో పోల్చదగిన నీ సుందరమైన రూప లావణ్యాన్ని ఏఱు తీసుకుపోయింది, ఏటిలో కొట్టుకుపోయింది కదా అన్నా.

ఒరేయ్ అన్నయ్యా నన్ను ఎంతో గారం చేస్తూ ఉండేవాడివి, ముద్దు చేస్తూ ఉండే వాడివి. ఇంక అలాంటిదేవీ లేకుండా ఉండిపోయాను. ఇంకా నేనెందుకు ఇక్కడ ఉండాలి. నాకు నీ తోడిదే లోకం రా అన్నయా – అని విలపించాడు.

వఱితి పాలయ్యెను, నీట గలసెను, వెల్లిబోయెను, ఏఱు గొనియెను – ఈ మాటలకు నశించిపోయింది అని తాత్పర్యం. శ్రీకృష్ణుడు హంసుణ్ణి మడుగులో తొక్కి చెంపేశాడు. కాబట్టి వాచ్యర్థం. వాచ్యార్థం, తాత్పర్యార్థం రెండూ కలిసేలాగ పదాలు కూర్చాడు కవి.

ఆ రోషంతో వెళ్ళి డిభకుడు శ్రీకృష్ణుడితో తలపడ్డాడు. శ్రీ కృష్ణుడు అతన్ని కూడా సంహరించి దుష్ట శిక్షణ చేశాడు.

పరమ శివుడిచే పొందిన దివ్యాస్త్రాలు గానీ, వరాలు గానీ హంస–డిభకుల్ని రక్షించలేకపోయాయి .

ఇదండీ – శ్రీమత్సకల భాషా భూషణ, సాహిత్య రస పోషణ, సంవిధాన చక్రవర్తి, సంపూర్ణ కీర్తి, నవీన గుణసనాథ, నాచన సోమనాథ ప్రణీతంబైన "ఉత్తర హరివంశం" బను గ్రంథంబు నుండి హంస డిభకుల వృత్తాంతం – టూకీగా.

తెలుగు కవిత్వాన్ని తేజో వంతం చేసిన కవుల్లో నాచ సోమన్న ఒకడు. అందుకే "సోముడు భాస్కరుండు, వెలిగింపన్" అన్నాడు రామరాజ భూషణుడు.

సమాప్తి

COMMENTS